సాక్షి జగిత్యాల

గురువారం, 16, మార్చి, 2023



అధిక పింఛన్ కోసం ధర్నా

జగిత్యాలటౌన్: తమకు అధిక పింఛన్ సౌకర్యం వర్తింపజేయాలని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు ఆర్డీవో ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు.



సమీపిస్తున్న 'పది' పరీక్షలు

పెగడపల్లి : పదో తరగతి వార్షిక పరీక్షల గడువు సమీపిస్తోంది. విద్యార్థులు పాఠ్యాంశాలు మననం చేసుకోవడం నిమగ్నమయ్యారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35.0/22.0

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆందోళన వద్దు

జగిత్యాల: విద్యార్థులు ఆందోళన పడకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఆమె బుధవారం సందర్శించారు. తొలిరోజు ప్రథమ సంవత్సరం పరీక్షలు జరిగాయి. జిల్లాలో 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇందులో 15 ప్రభుత్వ, ఒకటి మోడల్ స్కూల్, 13 ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయని వివరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవిద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే టెలిమానస్ - హెల్ప్‌లైన్ 14416కు ఫోన్‌చేసి మానసిక వైద్యుల నుంచి సూచనలు, సలహాలు పొందాలని ఆమె అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మాధురి, జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ, తహసీల్దార్లు ఉన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీపై నిరసన



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మెట్‌పల్లి(కోరుట్ల): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాల లీకేజీని నిరసిస్తూ పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట బుధవారం బీఎస్పీ నాయకులు ధర్నా నిర్వహించారు. బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి పుప్పాల లింబాద్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పరీక్షలన్నింటినీ రద్దు చేయాలన్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవకతవకలతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కల్యాణ్, అమర్, కిశోర్, రాములు, ప్రభాకర్, శ్రీనివాస్, నరేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్యం కాపాడుకోవాలి

జగిత్యాలఅగ్రికల్చర్: విద్యుత్ సిబ్బంది ఆరోగ్యం బాగుంటేనే వినియోగదారులకు 24 గంటలపాటు నాణ్యమైన సేవలు అందిస్తారని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సత్యనారాయణ అన్నారు. జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ, విద్యుత్ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న ఉద్యోగుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వైద్యశిబిరాలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీకృష్ణ, గోపీనాథ్, జీజోలే, మహేంద్రనాథ్, మదన్‌మోహన్, మహేశ్వర్ పాల్గొన్నారు.

న్యాక్‌లో ఉచిత కోర్సులు

జగిత్యాలటౌన్: న్యాక్, మెప్మా ఆధ్వర్యంలో నిర్మాణ రంగంలోని ఉపాధి కోర్సుల్లో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. ల్యాండ్ సర్వేయర్(ఇంటర్, ఐటీఐ)ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్(ఎస్సెస్సీ), ప్లంబింగ్, శానిటేషన్ (ఏడో తరగతి) అర్హతలు కలిగిన జగిత్యాల పట్టణానికి చెందిన 18 - 35ఏళ్ల వయసుగల నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 90రోజుల పాటు ఇచ్చే ఉచిత శిక్షణకు, ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామని పేర్కొన్నారు. యూనిఫాం, షూ, హెల్మెట్, స్టేషనరీ సమకూర్చుతామని వివరించారు. శిక్షణ పూర్తిచేసుకున్న యువతకు సర్టిఫికెట్లు అందిస్తామని, ప్రైవేట్ రంగం సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ప్రధానంగా గల్ఫ్ వెళ్లే వారికి న్యాక్ సర్టిఫికెట్ ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. విద్యార్హతల సర్టిఫికెట్లతోపాటు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జతచేయాలని పేర్కొన్నారు. వివరాల కోసం 95422 28988, 79897 50751 నంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.



జగిత్యాలలోని పరీక్ష కేంద్రంలో విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రంలోకి పరుగులు

జగిత్యాల: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జగిత్యాలలో 9, కోరుట్లలో 4, మెట్‌పల్లిలో 4, రాయికల్‌లో 2, మల్యాల, కొడిమ్యాల, ధర్మపురి, గొల్లపల్లి, వెల్గటూర్, సారంగాపూర్, బీర్‌పూర్, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కథలాపూర్‌లో ఒక్కోటి కేటాయించారు. తొలిరోజు 7,981 మంది విద్యార్థులకు 7,615 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా, పరీక్షలు పకడ్బందీగా చేపట్టామని, ఒక్క నిమిషం నిబంధన అమలుతో విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారని అధికారులు తెలిపారు. గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి.



కథలాపూర్: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



జగిత్యాల: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



జగిత్యాల: హాల్‌టికెట్లు సరిచూస్తున్న ఉపాధ్యాయుడు

అంతుచిక్కని హత్యలు!

- 2016 సెప్టెంబర్ 23న రాయికల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన మహిళ దువ్వాక రాజు(45)ను వ్యవసాయ పొలం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. ఇప్పటివరకు నిందితులు దొరకలేదు.
- 2019 జులై 7న మల్యాల మండలం కొండగట్టు గుట్టల ప్రాంతంలోని బొజ్జ పోతన్న ఆలయ సమీపంలో గుర్తుతెలియని యువతి హత్యకు గురైంది. ఇప్పటికీ నిందితుల ఆచూకీ లభించలేదు.
- 2020 జనవరి 1న వెల్గటూర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన తనుగుల మాధవి(40)ని గ్రామ శివారులోని గుట్టసమీప పత్తి చేలులో గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. నిందితుల జాడ ఇంకా తెలియలేదు.
- ఈనెల 14న మల్యాల మండలం ముత్యంపేట గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి శరీర భాగాలను గుర్తుపట్టకుండా కాల్చివేశారు. నిందితులను గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

- వ్యూహాత్మకంగా చంపుతున్న నిందితులు
- ఆధారాలు లభించకుండా పక్కాగా ప్లాన్ చేస్తున్న వైనం
- జిల్లాలో నాలుగుకు చేరిన 'మిస్టరీ' హత్యలు
- పోలీసులకు సవాల్‌గా మారుతున్న మర్డర్లు



ముత్యంపేటలో హత్యా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాలో అంతుచిక్కని హత్యలు జరుగుతున్నాయి. తమ ఆధారాలు లభించకుండా, పక్కా వ్యూహాత్మకంగా నేరస్తులు హత్యలకు పాల్పడుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నా నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. జిల్లాలో ఇప్పటికే ఇలాంటి హత్యలు మూడు జరిగాయి. వీటిలో పాలుపంచుకున్న నిందితుల జాడ ఇంకా దొరకలేదు. తాజాగా మల్యాల మండలం ముత్యంపేట శివారులో ఓ వ్యక్తి హత్య, దహనంలోనూ హంతకులను గుర్తించడం పోలీసులకు కష్టంగా మారింది.

అన్నికోణాల్లో దర్యాప్తు..

- జిల్లాలో ఇప్పటికే జరిగిన మూడు హత్యలతోపాటు ముత్యంపేట శివారులోని హత్య కేసులో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు.
- అయినా, నిందితులను గుర్తించడంలో చాలా రిస్క్ తీసుకుంటేగానీ ఆధారాలు లభించడం లేదని చెబుతున్నారు.
- కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల ఫైళ్లను కూడా పోలీసులు బయటకు లాగి లోతైన విచారణ జరుపుతున్నారు.
- సాంకేతిక పరిజ్ఞానం, సీసీ ఫుటేజీలు, ఇతర కోణాల్లోనూ చాలారోజుల పాటు విచారణచేసినా.. ఇప్పటికీ నిందితుల జాడ కనుక్కోలేకపోయారు.
- హత్య చేసినవారెవరూ ఇప్పటికీ తెలియకపోవడంతో తమవారు ఎందుకు, ఎవరిచేతిలో హత్యకు గురయ్యారో తెలియక బాధిత కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

పథకం ప్రకారమే హత్యలు..

రోజురోజుకూ సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందుతోంది. సోషల్ మీడియా వినియోగం అధికమైంది. ఈ కోవలోనే హత్యలు పెరుగుతున్నాయి. అయితే, హంతకులు కేసుల నుంచి తప్పించుకునేందుకు వీటిని వేదికగా చేసుకుని పథకం ప్రకారమే హత్యలు చేస్తున్నారని పోలీసులు భావిస్తున్నారు. సాక్ష్యాలు లభించకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతోపాటు హంతకులు హత్య ఓ చోట చేసి, మరోచోట మృతదేహాలను పడవేస్తున్నారు. ఇలా చేయడం కూడా ఆధారాలు లభించకుండా తయారువుతోందని పోలీసులు భావిస్తున్నారు. అటు మృతదేహాలను గుర్తించడం, హంతకులను గుర్తించడం సవాల్‌గా మారుతోందని పేర్కొంటున్నారు.

> **హంతకులను పట్టుకుంటాం**
>
> మల్యాల మండలం ముత్యంపేట శివారులో మంగళవారం లభ్యమైన మృతదేహం ఎవరిదనే విషయంపై లోతైన విచారణ చేస్తున్నాం. త్వరలోనే నిందితులను గుర్తిస్తాం. జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న హత్య కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న వారినీ పట్టుకుంటాం. హంతకులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు.
>
> – భాస్కర్, ఎస్పీ

మృతదేహం మిస్టరీ వీడితేనే విచారణ ముందుకు!

మల్యాల మండలం ముత్యంపేట శివారులోని చెత్తకుప్పల్లో పోలీసులకు లభించిన సగం కాలిన మృతదేహం ఎవరిదనే విషయం ఇంకా తేలలేదు. మృతదేహం ముక్కలై మంగళవారం లభ్యమైన విషయం విదితమే. శరీర భాగాలు లభించిన చోటే చంపి, దహనం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొన్ని శాంపిళ్లను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. నివేదిక వస్తేనే హతులు మహిళనా, పురుషుడా, వయస్సు ఎంత అనే విషయాలు తెలిసి దర్యాప్తు ముందుకు సాగుతుందని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు.. జిల్లాలోని పలు ఠాణాల్లో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలు కూడా సేకరిస్తున్నారు.

ఫిర్యాదులకూ ఓ పోర్టల్

- అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం
- ఆన్‌లైన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ వెబ్‌సైట్
- ఆధారాలు ఉంటే 22 రోజుల్లో పరిష్కారం



జగిత్యాల: జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. శిఖం, బఫర్ జోన్లు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి మరీ నివాసాలు కట్టుకుంటున్నారు. వీటిగురించి అధికారులకు నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఎవరూ సాహసించడంలేదు. అందుకే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసేందుకు వీలుగా సర్కారు ప్రత్యేకంగా ఓ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

22రోజుల్లో ఫిర్యాదు పరిష్కారం..

- మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా టీఎస్ బీపాస్‌ను అమలులోకి తీసుకొచ్చింది.
- ఇందులో దరఖాస్తు చేయకుండానే కొందరు దొంగచాటుగా నిర్మాణాలు చేపడుతున్నారు.
- ఇలాంటి వాటిని నియంత్రించేందుకు ఆన్‌లైన్ ద్వారా అధికారులు ఫిర్యాదు స్వీకరిస్తున్నారు.
- ఇలా స్వీకరించిన ఫిర్యాదును 22 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.
- ఫిర్యాదుదారులు సంప్రదించేందుకు header.enforcement.grivance వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.
- ఆధారాలతో సహా చేసిన ఫిర్యాదు చేస్తే.. పురపాలక సంఘం ఆధ్వర్యంలోని రాష్ట్ర టీపీవో విభాగం పర్యవేక్షిస్తుంది.
- అయితే, వెబ్‌సైట్ ఓపెన్ చేసి అన్ని వివరాలు, అక్రమ నిర్మాణాల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి.

మూడు దశల్లో ఫిర్యాదుల పరిశీలన..

1. వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయగానే **తొలిదశ(ఎల్-1)**లోని తహసీల్దార్, ఎస్సై, అగ్నిమాపక, ఆర్‌అండ్‌బీ అధికారులతో కూడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పరిశీలిస్తుంది.
2. రెండోదశ(ఎల్-2)లోని మున్సిపల్ కమిషనర్, టీపీవోవో పరిశీలన జరుపుతారు.
3. మూడోదశ(ఎల్-3)లో కలెక్టర్, సబ్‌కలెక్టర్‌తో కమిటీలు ఏర్పాటు చేస్తారు. చివరకు రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ కార్యాలయం ఈ ఫిర్యాదును పరిశీలిస్తుంది.

> **ఫిర్యాదు చేయండి**
>
> ఎన్‌ఫోర్స్‌మెంట్ పోర్టల్‌లో అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులను మూడు దశల్లో పరిశీలిస్తారు. అక్రమాలు నియంత్రణలోకి వస్తే.. టీఎస్ బీపాస్ ద్వారా అనుమతులు జారీచేస్తాం. తద్వారా మున్సిపల్ ఖజానాకు ఆదాయం సమకూరుతుంది.
>
> – శ్యామ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి, జగిత్యాల

క్షేత్రస్థాయిలో నిర్ధారణ..

- అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు అందిన వెంటనే ఎల్-1 క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమా? కాదా? అని నిర్ధారిస్తుంది. ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటుంది. ఎల్-2,తోపాటు ఎల్-1 బృందాలు వీటిని తరచూ పర్యవేక్షిస్తుంటాయి. అయితే, ఫిర్యాదారు పూర్తిపేరు, ఈ మెయిల్ అడ్రస్, నిర్మాణ ప్రాంతం, పేరు, ఫొటోలు అప్‌లోడ్ తప్పకుండా చేయాలి. వీటిని ఎల్-1 పరిశీలించాక చర్యలు తీసుకోవాల్సి ఉంటే ఎల్-2కు రెఫర్ చేస్తారు. ఇది పరిశీలించాక అక్రమంగా ఉందా, సక్రమంగా ఉందా అనేది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుంది. అక్రమమైతే కూల్చివేయడాని నిర్ణయం తీసుకుంటుంది. ఈ ప్రక్రియ 22 రోజుల్లో పూర్తవుతుంది.

అక్రమాలు అనేకం..

- జిల్లాలో అనుమతి లేకుండా అనేకంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.
- ఐదు మున్సిపాలిటిల్లో టీఎస్ బీపాస్ ద్వారానే అధికారులు అనుమతులు జారీ చేస్తున్నారు.
- అయినా, కొందరు అక్రమార్కులు బఫర్ జోన్లు, లేఅవుట్లు లేని భూములు, శిఖంలో ఇళ్లు నిర్మిస్తున్నారు.
- రాజకీయ నాయకులు ఒత్తిళ్లతో ఇలాంటి వాటిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.
- కానీ, ప్రస్తుతం ఫిర్యాదు కోసం ప్రత్యేకంగా పోర్టల్ అందుబాటులోకి రావడం, అందులో సమగ్ర వివరాలతో ఫిర్యాదు చేయడం, అది మూడు దశల్లో ఉన్నతాధికారుల వరకూ వెళ్లడంతో ఇకనుంచి ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా అధికారులు తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు.
- తద్వారా అక్రమ కట్టడాలు నియంత్రణలోకి వస్తాయని అంటున్నారు.
- మరోవైపు.. ఆపరేషన్ ఎలా చేయాలనే దానిపై మున్సిపాలిటీల్లోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు గత ఫిబ్రవరి 28న శిక్షణ కూడా ఇచ్చారు.
- అయితే, వీరికి ఎన్‌ఫోర్స్‌మెంట్ పోర్టల్‌పై అవగాహన కల్పించాల్సి ఉంది.

లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలి

జగిత్యాలరూరల్: రేషన్‌కార్డుదారులకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ లత డీలర్లను ఆదేశించారు. పలు రేషన్ దుకాణాలను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాసిరకం బియ్యం పంపిణీ చేయొద్దన్నారు. డీలర్లు సమయపాలన పాటించాలని, ధరల బోర్డు, ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్ పాల్గొన్నారు.



దుకాణం తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ లత

నాణ్యత పాటించకుంటే చర్యలు

బుగ్గారం(ధర్మపురి): మన ఊరు.. మన బడి ద్వారా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే పనుల్లో నాణ్యత లేకుంటే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ మకరంద హెచ్చరించారు. చిన్నాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన పనులను ఆయన బుధవారం పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఫ్లోరింగ్ పనుల్లో పగుళ్లు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం బుగ్గారంలోని కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారుఖ్, ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో అఫ్జల్‌మియా, ఏఈ హరీశ్, చిన్నాపూర్ కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మకరంద

'కట్టా'ను పట్టుకున్నాం!

- 34 ఏళ్లుగా పంచాయతీరాజ్‌లో కట్టా విష్ణువర్ధన్ కొలువు
- 'సాక్షి' పరిశోధన కథనాలతో వెలుగుచూసిన వాస్తవం
- ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టిన అధికారులు
- అతని తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ టీచర్లేనన్న దర్యాప్తు
- 1956లో తల్లి నిరూప, 1967లో విష్ణువర్ధన్ జన్మించినట్లు రికార్డులు
- ఉన్నత విద్య కోసం లీవులే పెట్టలేదని తేల్చిన అధికారులు
- క్రిమినల్ ఇన్‌టెన్షన్‌తో వ్యవస్థలను తప్పదోవ పట్టించాడని నివేదిక



విష్ణువర్ధన్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 34 ఏళ్లపాటు వ్యవస్థల కళ్లకు గంతలు కట్టాడు. ఎలాంటి అర్హత లేకున్నా.. కారుణ్య నియామకం కింద ఉద్యోగం పట్టాడు. ఉద్యోగం చేస్తూనే ఒక్కరోజు కూడా లీవు పెట్టకుండా ఇంజినీరింగ్ సర్టిఫికెట్లు కొట్టాడు. తన తల్లి కంటే తాను కేవలం 10 ఏళ్లు మాత్రమే చిన్నోడినంటూ రికార్డులు ఇచ్చి అధికారులను ఒప్పించాడు. దొడ్డిదారిలో ప్రభుత్వ ఉద్యోగం సాధించి, సుప్రీం కోర్టు నిబంధనలకు వ్యతిరేకంగా పదోన్నతులు పొంది ఇంతకాలం సమాజాన్ని మోసం చేస్తూ వస్తోన్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ కట్టా విష్ణువర్ధన్ ఆట ముగిసింది. 'పట్టుకోండి చూద్దాం' పేరుతో 'సాక్షి' కొంతకాలంగా ప్రచురిస్తున్న కథనాలు నిజమేనని అతని వ్యవహారంపై విచారణ జరిపిన అధికారులు నిగ్గు తేల్చారు. ఇటీవలే దర్యాప్తు నివేదికను హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ కార్యాలయానికి పంపారు. ఈ నివేదిక ప్రతిని 'సాక్షి' సంపాదించింది. ఇంతకీ ఆ నివేదికలో ఏముందంటే..?

రికార్డులే లేవు.. అన్నీ అక్రమాలే..!

పంచాయతీరాజ్ విభాగం వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. కరీంనగర్ సబ్-డివిజన్, ఏఈ, కట్టా విష్ణువర్ధన్ మార్చి 2, 1967లో కట్టా వెంకట నాగరత్నాచారి, కట్టా నిరూపలకు కశ్మీర్‌గడ్డలో జన్మించారు. వీరిద్దరూ ప్రభుత్వ టీచర్లే. 1987లో వెంకట నాగరత్నాచారి మరణించారు. తన తల్లి ప్రభుత్వ టీచరు అన్న విషయాన్ని దాచి 1988లో కారుణ్య నియామకం కింద పంచాయతీరాజ్‌లో అప్పటి ఉమ్మడి జిల్లాలోని మహదేవాపూర్‌లో విష్ణువర్ధన్ గ్రేడ్-3 వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా చేరారు. వాస్తవానికి 1984లోనే కట్టా నిరూప ప్రభుత్వ టీచర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ డీఈవో కార్యాలయంలో ఆమె పుట్టిన తేదీ ఫిబ్రవరి 01, 1956గా ఉంది. విచిత్రంగా విష్ణువర్ధన్ తన పదో తరగతి సర్టిఫికెట్లలో మార్చి 02, 1967లో జన్మించినట్లు పేర్కొన్నారు. అంటే ఇద్దరి మధ్య కేవలం పదేళ్లే వ్యత్యాసమా? వాస్తవానికి విష్ణువర్ధన్ నియామకం సమయంలో అధికారులు ఈ చిన్న పాయింట్‌ను పసిగట్టలేకపోయారు. తీరా ఇటీవల అధికారులు విచారణ ప్రారంభించినప్పుడు అతని సర్వీసు బుక్ లభ్యమైందే తప్ప.. అతని నియామక రికార్డులు మాయం కావడం గమనార్హం.

పేరు, విద్యార్హతలపై అనేక సందేహాలు..!

విష్ణువర్ధన్ 1988లో సమర్పించిన సర్టిఫికెట్ల ప్రకారం.. 1967లో జన్మించానని చెప్పుకున్నారు. అవేగాక పదోన్నతుల సమయంలో మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా (ముంబై), బీటెక్ సివిల్ (రాజస్తాన్ డీమ్డ్ వర్సిటీ) సర్టిఫికెట్లు చూపారు. ఈ సర్టిఫికెట్ల విశ్వసనీయతపైనా దర్యాప్తు అధికారులు సందేహాలు వ్యక్తం చేశారు. వీటి ఆధారంగా విష్ణువర్ధన్ నాలుగు సార్లు పదోన్నతులు పొందారు. కానీ.. ఈ కోర్సులు చేస్తున్న సమయంలో ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం లేదు. ఆ కోర్సుల పరీక్షలకు హాజరయ్యే సమయంలో ఎలాంటి లీవులు పెట్టినట్లుగా రికార్డులే లేవని, అసలు ఆ సర్టిఫికెట్లు రెగ్యులరా? లేక దూరవిద్యావా? అన్న విషయం విష్ణువర్ధన్ స్పష్టత ఇవ్వలేదని నివేదికలో పొందుపరిచారు. పదోన్నతుల సమయంలో అతని ఉన్నతాధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించలేదని, అతని సర్టిఫికెట్ల విశ్వసనీయతను సైతం పరిగణనలోకి ఎందుకు తీసుకోలేదని తోటి ఉద్యోగులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో విష్ణువర్ధన్‌ను ఇంటి వద్ద అంతా 'వాసు' అని పిలుస్తారని గుర్తు చేస్తున్నారు. ఇన్ని అక్రమాలకు పాల్పడిన అతన్ని సర్వీసు నుంచి తొలగించాలని అతని తోటి ఉద్యోగులంతా వరుసగా హైదరాబాద్ ఈఎన్‌సీ కార్యాలయానికి ఫిర్యాదులు చేస్తున్నారు.

విష్ణువర్ధన్‌ది క్రిమినల్ ఇన్‌టెన్షన్..!

వాస్తవానికి నిబంధనల ప్రకారం.. కారుణ్య నియామకం కింద టైపిస్ట్, స్టెనో, క్లర్క్ ఇలాంటి దిగువ కేటగిరీ ఉద్యోగాలు ఇవ్వాలి. కానీ.. ఇతని విషయంలో మాత్రం వర్క్ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్-3 ఇవ్వడం తమకు ఆశ్చర్యానికి గురిచేసిందని నివేదికలో దర్యాప్తు అధికారులు స్పష్టంచేశారు. అతను అనర్హుడని, అక్రమార్కుడని యథేచ్ఛగా అన్ని వ్యవస్థలను మోసం చేశాడని, ఉన్నతాధికారుల కళ్లకు గంతలు కట్టాడని వివరించారు.

- అతను విధుల్లో చేరినప్పటి నుంచి ఈ రోజు వరకు విధి నిర్వహణ మొత్తం అనుమానాస్పదంగా, క్రిమినల్ ఇన్‌టెన్షన్‌తోనే ఉందన్నారు. ఇందుకు బాధ్యులైన ప్రతీ అధికారిపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు.

పట్టుకోండి చూద్దాం పార్ట్ 5

> **రిమూవల్ ఆఫ్ సర్వీస్ చేయాలి**
>
> 
>
> విష్ణువర్ధన్ పేరు నుంచి విద్యార్హతల వరకు అన్నీ నకిలీనే. 34 ఏళ్లుగా ప్రభుత్వ రంగ సంస్థలను మోసం చేస్తూ వస్తున్నాడు. అతని విద్యార్హతలపై చాలా కాలంగా పోరాటం చేస్తున్నాం. అత్యంత అవినీతి పరుడు, తోటి ఉద్యోగులను వేధించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. పేరెంట్స్ సర్కారు ఉద్యోగులని తెలినా కారుణ్య నియామకం కింద అతన్ని కొనసాగించడం దారుణం. వెంటనే అతన్ని రిమూవల్ ఆఫ్ సర్వీస్ చేయాలి.
>
> – అమీర్, సామాజిక ఉద్యమకారుడు

- ఇతని అక్రమాలపై పూర్తిస్థాయిలో ఆరా తీసి, రికవరీకి సిఫారసుచేశారు. అదే సమయంలో విద్యార్హతలపై గందరగోళం ఉందని వాటిపైనా లోతైన దర్యాప్తు చేయాలని చెప్పారు.

క్లుప్తంగా

పుష్పగుచ్ఛం అందజేత



శ్రావణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నరేంద్ర

జగిత్యాలటౌన్ : బీజేపీ ఎన్నారై సెల్ గల్ఫ్ మిడిల్ ఈస్ట్ కన్వీనర్ డా. నరేంద్ర పన్నీర్ బుధవారం బల్దియా మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణిని ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో బీర్పూర్ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బసవరాజుల సంతోష్, చందుర్తి మండల బీజేపీ ఉపాధ్యక్షుడు వంకాయల కార్తీక్, చందుర్తి మండల బీజేవైఎం అధ్యక్షుడు అంబల శ్రీకాంత్, కార్యకర్తలు రాజన్న, శ్రీను, తదితరులున్నారు.

మార్షల్ ఆర్ట్స్ బెల్టు గ్రేడింగ్



కరాటే బెల్టులు సాధించిన విద్యార్థులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం మార్షల్ ఆర్ట్స్ గ్రేడింగ్ నిర్వహించారు. పలువురు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఛీఫ్ ఎగ్జామినర్ వసంత్‌కుమార్ బెల్టులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ అసిస్టెంట్ కోచ్ రాకేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, పీఈటీలు శ్రీకాంత్, సుప్రజ, అనిల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యప్రదర్శన

ధర్మపురి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై కళాకారులు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాకారులను దేవస్థానం పక్షాన స్వామివారి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు అందించారు.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ అనుమల్ల సౌమ్య భర్త।। ఎ.వి. రాజశేఖర్ నివాసము జగిత్యాల (ఆధార్ నెం. 2600 5996 5564) గారు శ్రీ మహ్మద్ జులైకుర్ అహ్మద్ తండ్రి।। నజీర్ నివాసము జగిత్యాల (ఆధార్ నెం. 2307 0925 9381) గారికి చెందిన చెలిగల్ గ్రామము, జగిత్యాల మండలములో ఉన్న వ్యవసాయ భూమి సర్వే నెం. 888/అ మరియు 888/ఇ యందలి భూమి విస్తీర్ణము 0-26 గుంటలు (One Compact Block) (డాక్యుమెంట్ నెం. 6143/2016, SRO Jatial, Dharani No. T18070131308) ఈ భూమికి హద్దులు ఉత్తరమున దాండా మహేష్ వ్యవసాయ భూమి, దక్షిణమున ఎం.ఎ అలీమ్ మరియు ఇతరుల వ్యవసాయ భూమి, తూర్పున దారి, పడమర లాశెట్టి రమేష్ వ్యవసాయ భూమి కలిగి ఉన్నది.

నా క్లయింట్ పై మొత్తము 26 గుంటల భూమిని కొనుగోలు చేయుటకు నిర్ణయించి కొంత మొత్తమును (Part Payment) బయానాగా (అడ్వాన్స్) చెల్లించినారు. ఈ భూమిపైన ఎవరికైన ఎమైన అభ్యంతరములు, హక్కులు ఉన్న యెడల తగిన సాక్ష్యాధారములతో ఈ క్రింద తెలిపిన నా అడ్రస్‌లో (15) రోజులలోగా సంప్రదించగలరు. లేనిచో నా క్లయింట్ పేరుమీదగాని, తనకు సంబంధించిన వ్యక్తుల పేరుమీద కాని పై భూమికి ఎలాంటి అభ్యంతరములు లేవు అని భావించి, మిగిలిన విక్రయ ధనమును చెల్లించి తగిన రిజిస్టర్ సేల్ డీడ్ ప్రక్రియను పూర్తి చేసుకోగలరని మరియు తదుపరి వచ్చు అభ్యంతరములు చెల్లనేరవని ఐయమూలముగా తెలుపనైనది.

తేది: 15-03-2023 జగిత్యాల
సం/- బాశెట్టి జ్ఞానప్రకాశ్ న్యాయవాది
2-3-235, టవర్ సర్కిల్, జగిత్యాల- 505327.
సెల్: 9885528414

సమీపిస్తున్న 'పది' పరీక్షలు

- ప్రశాంత వాతావరణంలో చదవాలి
- ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం
- విద్యార్థులకు నిపుణుల సూచనలు



పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

పెగడపల్లి: ప్రతి విజయానికి ప్రణాళిక తప్పనిసరి. లక్ష్యంతో చదివితే ఏదైనా సాధించడం సులువే. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. భయంవీడి ప్రశాంత వాతావరణంలో చదివితే ఉత్తీర్ణత సులభమేనని పాఠ్యాంశాల నిపుణులు పేర్కొంటున్నారు. ఒత్తిడిని అధిగమించి అనవసర ఆందోళనతో ఆరోగ్యం పాడు చేసుకోవద్దని, సమయానికి ఆహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులు సూచిస్తున్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పరీక్షలకు ఎలా సన్నద్ధంకావాలో విద్యార్థులకు పలువురు నిపుణులు ఇస్తున్న సూచనలు..

'పది'మెట్టు..

విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకం. మొట్ట మొదటిసారి వార్షిక పరీక్షలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఎంతో ఆందోళన ఉంటుంది. బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటారు.

8 గంటల నిద్ర అవసరం..

పరీక్షలు దగ్గరపడుతున్నాయనిఅదే పనిగా చదవడం మంచిది కాదు. బట్టీ పట్టకుండా ప్రతి విషయాన్ని అర్థం చేసుకునేలా చదవాలి. రోజూ 8 గంటలు నిద్ర అవసరం. కనీసం ఆరు గంటలైనా తప్పకుండా నిద్రపోవాలి.

ప్రశాంత వాతావరణం కల్పించాలి

తల్లిదండ్రులు బాగా చదవాలని పిల్లలపై ఒత్తిడి తీసుకురావద్దు. ఇంట్లో చదువుకునేందుకు ప్రశాంత వాతావరణం కల్పించాలి. ఇతరులతో పోల్చి వారిలో ఆత్మన్యూనత భావాన్ని దెబ్బతీయొద్దు.

గణితంపై భయం వీడాలి..



గణితం అంటే భయం వీడాలి. సూత్రాలను అర్థం చేసుకొని సాధన చేయాలి. దినపత్రికలో మంచి ప్రశ్నలు వస్తున్నాయి. సాధన చేస్తే మంచి ఫలితాలు సాధించొచ్చు. సీసీఈ విధానం అమల్లో ఉంది. విద్యార్థుల సృజనకు పరీక్ష పెట్టేలా ప్రశ్నలు వస్తాయి. ఎంత సాధన చేస్తే అంత మంచి గ్రేడింగ్ పాయింట్లు సాధించవచ్చు.

– సదయ్య గణితం ఉపాధ్యాయుడు, సుద్దపల్లి

ప్రశ్నపత్రాన్ని అర్థం చేసుకోవాలి



పరీక్షల్లో ప్రశ్నపత్రాన్ని ముందుగా అర్థం చేసుకోవాలి. భౌతిక, రసాయన శాస్త్రాలతో పాటు ఇతర పాఠ్యాంశాల్లో ఉత్తమ మార్కులు సాధించాలంటే మంచి దస్తూరి అవసరం. ప్రశ్నాపత్రాల్లో చాప్టర్ల వారీగా కాకుండా విద్యా సామర్థ్యాల ఆధారంగా మార్కులు కేటాయింపు ఉంటుంది.

–సుమలత ఫిజికల్ సైన్స్ టీచర్, మోడల్ స్కూల్

ఆందోళన చెందొద్దు



పరీక్షలు సమీపిస్తున్నాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రశాంతంగా చదివితేనే చదివినవి గుర్తుండిపోతాయి. సమయపాలనతో చదివితే విజయం వరిస్తుంది. మంచి ఫలితాలను సాధించవచ్చు.

– రవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

సమయానుకూలంగా ఆహారం తీసుకోవాలి



విద్యార్థులు సరైన సమయానికి ఆహారం తీసుకోవాలి. సమయం లేదని తినకుండా ఉండటం ఆరోగ్యానికి మంచిదికాదు. తేలికగా జీర్ణమయ్యే ఆహారం మాత్రమే తీసుకోవాలి. ఇంట్లో పరిశుభ్రంగా ఉండే పప్పు దినుసులు, ఆకు కూరలతో వండే ఆహారం తీసుకోవాలి. తాగునీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి. చల్లటి ఫ్రిజ్‌లోని నీరు కాకుండా గోరువెచ్చని నీరు తీసుకోవడం మంచిది. వీలైనంత వరకు పండ్లరసాలు, పాలు తీసుకోవాలి.

నరేశ్, వైద్యాధికారి

జంతర్‌మంతర్ దీక్షలో సత్యరాజ్ వర్మ



దీక్షా శిబిరంలో వైఎస్సార్‌టీపీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యరాజ్ వర్మ, నాయకులు

మల్యాల: రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అప్రజాస్వామిక పాలన, ప్రతిపక్షాల అణచివేతపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల చేపట్టిన దీక్షలో మల్యాల మండలం వైఎస్సార్‌టీపీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యరాజ్ వర్మ పాల్గొన్నారు. పార్టీ అధినేత్రి పాదయాత్రకు అధికార పార్టీ నాయకులు సృష్టిస్తున్న అడ్డంకులు, సీఎం కేసీఆర్ అప్రజాస్వామిక పాలనతో పడుతున్న ఇబ్బందులను జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు వివరించినట్లు సత్యరాజ్ వర్మ తెలిపారు.

ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై
సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్

కథలాపూర్ (వేములవాడ): టీఎస్‌పీఎస్సీ పరీక్ష పశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కాంగ్రెస్ సీనియర్ నేత ఆది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కథలాపూర్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల ప్రమేయం ఉందనే అనుమానాలున్నాయని, ప్రభుత్వం ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించవద్దన్నారు. ఏళ్ల తర్వాత నోటిఫికేషన్లు ఇచ్చి ప్రశ్న పత్రాలను లీకేజీలు చేయడం కాలయాపన కోసమేనని మండిపడ్డారు. ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ అజీమ్, నాయకులు తొట్ల అంజయ్య, పులి హరిప్రసాద్, ఆకుల సంతోష్, పాల నవీన్, తిరుపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

వెల్గటూర్ : మండలంలోని కిషన్‌రావుపేట నాగపెల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో వెల్గటూర్ జడ్పీ ఉన్నత పాఠశాల (1999–2000)లో చదివిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 23 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా తమ చిన్ననాటి పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆప్యాయంగా పలకరించారు. ఒకరినొకరు యోగ క్షేమాలను తెలుసుకొని సరదాగా గడిపారు. కార్యక్రమంలో గాలిపెల్లి నరేశ్, కుషనపెల్లి రాజేశ్, బుర్ర సతీశ్, పత్తిపాక వెంకటేశ్, సుద్దాల నరేశ్, సుద్దాల సుభాష్, వేయిగండ్ల అంజయ్య, సతీశ్, గొల్లపల్లి ప్రసాద్, వాసం తిరుపతి, పొన్నం తిరుపతి, జోగం వేణు, గుమ్ముల మల్లేశ్, గౌరు సంతోష్, నారాయణ, చంద్రశేఖర్, గోళ్ల సత్తయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

దోపిడీకి యత్నించిన దొంగల అరెస్ట్

- పది ఆక్సిజన్, రెండు గ్యాస్ సిలిండర్లు స్వాధీనం



అరెస్ట్ చూపుతున్న సీఐ రమణమూర్తి

పెగడపల్లి : మండలంలోని నామాపూర్ శివారులో మెఘా కంపెనీకి చెందిన ఇనుప పైపుల దోపిడీకి యత్నించిన దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు మల్యాల సీఐ రమణమూర్తి తెలిపారు. పెగడపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. రామడుగు మండలంలోని పలు గ్రామాలకు చెందిన నూనె నర్సయ్య, కడమంచి రమేశ్, కడమంచి సంపత్, నూనె కనకరాజు, నూనె కృపరాజు, పస్తం కల్యాణ్‌తో పాటు మెఘా కంపెనీలో వెల్డర్లుగా పనిచేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన గుల్షన్ కుమార్, మిథిన్‌కుమార్, మరో ఇద్దరు మైనర్లు దొంగల ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి ఈనెల 13న రాత్రి మండలంలోని నామాపూర్ శివారులో మెఘా కంపెనీకి చెందిన 4 ఎంఎం డయా (ఎంస్) పైపులను ఆక్సిజన్ సిలిండర్లు, రెండు గ్యాస్ సిల్లిండర్లతో ట్రాలీ ఆటోలో వచ్చి ముక్కలుగా కట్‌చేశారు. అదే సమయంలో కంపెనీలో పని చేస్తున్న వాచ్‌మెన్ రామిడి సంజీవరెడ్డి అక్కడకి రావడంతో సిలిండర్లు, ఆటోను సంఘటనా స్థలంలో వదిలేసి దొంగలు పరారయ్యారు. మేఘా కంపెనీలో అడ్మిన్‌గా పనిచేస్తున్న బక్కతట్ల అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు తెలిపారు. దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మండలకేంద్రంలోని నంది విగ్రహం వద్ద ఈ ముఠా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. వీరి నుంచి 10 ఆక్సిజన్, రెండు గ్యాస్ సిలిండర్లతో పాటు కట్‌చేసిన పైపు ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. దొంగల ముఠాను పట్టుకున్న ఏఎస్సై స త్తయ్య, పీసీలు సంపత్, వెంకట్‌రెడ్డి, ఎల్లయ్య, ఉదయ్, మహేశ్, ఎల్లయ్యను సీఐ అభినందించారు.

బస్‌పాస్‌ల కోసం దరఖాస్తుల స్వీకరణ



వికలాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్టీసీ అధికారి

ఇబ్రహీంపట్నం : వికలాంగులకు ఆర్టీసీ బస్సు పాస్‌లు అందించేందుకు బుధవారం ఇబ్రహీంపట్నంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మెట్‌పల్లి డిపో ఆర్టీసీ అధికారులు దరఖాస్తులను తీసుకున్నారు. వికలాంగుల సర్టిఫికెట్, ఆధార్ కార్డుతోపాటు 20 మంది వికలాంగుల దరఖాస్తులను స్వీకరించి వీరిలో అర్హులైన వారికి బస్‌పాస్‌లను ఇవ్వనున్నట్లు ఆర్టీసీ సీఆర్‌సీ సురేశ్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పూల్‌సింగ్ నాయక్, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉపేందర్, సీఆర్‌సీ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత



ఆవులను దింపుతున్న పోలీసులు

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులో బుధవారం రవాణా శాఖ అధికారులు వంశీధర్, వెంకటరమణ వాహనాల తనిఖీ చేపట్టారు. మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి 29 పశువులను లారీలో నిజామాబాద్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. అనంతరం లారీని ఆర్టీసీ డిపోకు తరలించగా అందులో ఆవులున్నట్లు రవాణా శాఖ అధికారులు గుర్తించారు. వాహనాన్ని అధికా రులు సీజ్‌చేశారు. వెంటనే పశు వైద్యాధికారులను రప్పించి జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి శివారులోని గోశాల వద్ద పశువులను దింపారు. ఇందులో రెండు ఆవులు మృతిచెందగా మరో 11 ఆవులు, 16 గేదెలు గోశాలకు తరలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పల్లికొండ మహేశ్ ఫిర్యాదు మేరకు లారీ యజమాని అక్బర్‌ఖాన్, లారీ డ్రైవర్ మహబూబ్‌ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

ఇద్దరిపై కేసు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రం గొల్లపల్లి రోడ్డులోని బైపాస్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా హోంగార్డు విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. గొల్లపల్లి రోడ్డులో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా హోంగార్డు గోశెట్టి రాజు జిల్లా కేంద్రంలోని విజయపురికి చెందిన దయ్యాల మహేశ్, చెట్టి మహేందర్ ద్విచక్రవాహనాన్ని ఆపాడు. ఆగ్రహానికి గురైన మహేశ్, మహేందర్ హోంగార్డు రాజును నెట్టేసి విధులకు ఆటంకం కల్పించారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

- కలెక్టర్ యాస్మిన్ బాషా
- వైద్యాధికారులపై ఆగ్రహం



కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని, అర్హులందరికీ కంటి పరీక్షలు చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పరీక్షల కోసం ఒకే ఒక్కరు రావడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాలపై వైద్యశాఖ నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే వేటు తప్పదని హెచ్చరించారు.

'గురుకుల' ప్రవేశ దరఖాస్తులకు నేడే చివరి తేదీ

తంగళ్లపల్లి (సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో ఐదో తరగతి ప్రవేశాల దరఖాస్తుకు గురువారం చివరి తేదీ అని ప్రిన్సిపాల్ ఎస్.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని బాలికలు నేడు ఆన్‌లైన్ ద్వారా రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బద్దెనపల్లి గురుకులంలో 80 సీట్లు ఉన్నాయని నాలుగో తరగతి చదువుతున్న బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు హెల్ప్ లైన్ నెంబర్ 180042545678 ను సంప్రదించాలన్నారు.

12 తులాల బంగారు ఆభరణాలు చోరీ



తెరిచి ఉన్న బీరువా

బోయినపల్లి (చొప్పదండి) : మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన అనుపట్ల మల్లారెడ్డి ఇంట్లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై పుల్లా అభిలాష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..మల్లారెడ్డికి ఇద్దరు కుమారులుండగా వేర్వేరు ఇళ్లు ఉన్నాయి. ఓ ఇంట్లో ఏడాదిగా మల్లారెడ్డి వియ్యంకుడు లచ్చిరెడ్డి ఉంటున్నాడు. మరో ఇంట్లో మల్లారెడ్డి కుమారుడు కరుణాకర్ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. బుధవారం ఉదయం కరుణాకర్ గేదెలకు మేత వేసేందుకు వెళ్లగా వచ్చేసరికి బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో 12 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించారు. మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై అభిలాష్ చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టారు.

మరో రెండ్రోజులు సాగునీరందించాలి

సారంగాపూర్ : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి డీ–53 ద్వారా వచ్చే సాగునీటిని మరో రెండ్రోజులు అందించాలని సీఈ సుధాకర్ రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సారంగాపూర్, బట్టపల్లి, పోతారం గ్రామాలకు సాగునీరందించే డీ–53, 12 ఎల్, 1 ఆర్ కాలువ కింద దాదాపు 150 ఎకరాల్లో పంటపొలాలు ఎండుతున్నాయని, దీనిపై క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించినట్లు తెలిపారు. మరో రెండ్రోజులు నీరందిస్తే పోతారం శివారుల్లోని పోసానుకుంట నిండి దిగువన బట్టపల్లి గ్రామ రైతుల పొలాలకు నీరందుతుందని సీఈని కోరగా దీనికి అంగీకరించినట్లు ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

సాగునీటి కాల్వలను పరిశీలించిన డీఈ

సారంగాపూర్, బట్టపల్లి, పోతారం గ్రామాల్లోని సాగునీటి కాల్వలను నీటిపారుదల శాఖ డీఈ చక్రూనాయక్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి పర్యవేక్షణపై నీటిపారుదల శాఖ జేఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించినట్లు తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



మైసమ్మ (ఫైల్)

ఇబ్రహీంపట్నం : మండలంలోని గోధూర్ ఒడ్డెర కాలనీకి చెందిన దండుగుల మైసమ్మ (45) మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ రామయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మైసమ్మ పదేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతుంది. ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి కొడుకు దండుగుల అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి



లింగయ్య (ఫైల్)

బోయినపల్లి (చొప్పదండి): పొలం పనులకు వెళ్లి తిరిగివస్తుండగా బైక్ ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై పుల్లా అభిలాష్ తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన కల్లెపెల్లి లింగయ్య (75) పొలం వద్దకు వెళ్లి రోడ్డుపై నడచుకుంటూ తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో వేములవాడ రూరల్ మండలం.. తుర్కాశీ నగర్‌కు చెందిన షేక్ బాబా ద్విచక్రవాహనంపై బూర్గుపల్లి వైపు వేగంగా వచ్చి లింగయ్యను వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో లింగయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. తన తండ్రి మృతికి కారణమైన షేక్ బాబాపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు కల్లెపెల్లి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై జిల్లా ఉన్నత స్థాయి మల్టీ మెంబర్ కమిటీ సమావేశం బుధవారం జిల్లా జడ్జి నీలిమతో కలిసి నిర్వహించారు. స్త్రీ, పురుషుల నిష్పత్తి కొన్ని మండలాల్లో తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రైవేటు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇందుకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జరిమానాతో పాటు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు సమియొద్దీన్, శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మేడిపెల్లి : భీమారం మండలకేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం ఎమ్మార్వో యూసుఫ్ పట్టుకున్నారు. అనంతరం ఇసుకను స్వాధీనం చేసుకొని రూ.5 వేల జరిమానా విధించారు. మరోసారి ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎమ్మార్వో వెంట ఆర్ఐ రాజేందర్, వీఆర్ఏలు సుమన్, గంగాధర్, మౌలానా ఉన్నారు.